క్లుప్తంగా

సర్పంచుల పదవీ కాలం పొడిగించాలి

రామారెడ్డి(ఎల్లారెడ్డి): కరోనా సమయంలో రెండేళ్ల కాలాన్ని ఎన్నికల వరకు పొడిగించాలని సర్పంచ్‌లు హైదరాబాద్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం చేశారని పోసానిపేట సర్పంచు గీరెడ్డి మహేందర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిధులు మంజూరు చేసి ఉన్న సర్పంచులకు ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వాలని కోరారు.

కార్యదర్శి సంతకం ఫోర్జరీ

లింగంపేట(ఎల్లారెడ్డి): తన సంతకం గుర్తు తెలియని వ్యక్తి ఫోర్జరీ చేసినట్లు లింగంపేట తహసీల్దార్ సుధాకర్‌కు ఫిర్యాదు చేసినట్లు పర్మళ్ల పంచాయతీ కార్యదర్శి శ్వేత తెలిపారు. పర్మళ్ల గ్రామానికి చెందిన రావుల శ్రీనివాస్ కూతురు పెళ్లి ఆరు నెలల క్రితం జరిగింది. ఈ క్రమంలో కల్యాణ లక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి జీపీకి వచ్చారు. పెళ్లి కూతురు వయస్సు తక్కువగా ఉన్నందున దరఖాస్తు ఫైలు వాపసు పంపినట్లు కార్యదర్శి పేర్కొన్నారు. పెళ్లి పత్రికను మార్పు చేసి వయస్సు పెంచి కొత్త ఫైల్ తయారు చేసుకొని కార్యదర్శి సంతకం, స్టాంపులు ఫోర్జరీ చేసి ఎంపీడీవో సంతకం తీసుకొని, ఆర్ఐ వద్ద సంతకం కోసం వెళ్లారు. సంతకం, స్టాంపు ఫోర్జరీగా గుర్తుపట్టి ఆర్ఐ, కార్యదర్శిని పిలిచి సంతకం, స్టాంపు మీదేనా అని ఆరా తీయగా ఫోర్జరీ అని తేలింది. దాంతో ఫిర్యాదు చేసినట్లు కార్యదర్శి తెలిపారు. ఫోర్జరీ చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆరోగ్య సేవలను వినియోగించుకోవాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): ప్రజలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఆస్మా అఫ్షిన్ అన్నారు. గురువారం గర్భిణులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు ప్రధానంగా తీసుకోవల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ఆహార నియమాలను వివరించారు. ప్రతి మంగళవారం ఆస్పత్రిలో మహిళలకు ప్రత్యేకంగా పరీక్షలు చేస్తున్నామని ఆమె తెలిపారు. సీహెచ్‌వో నాగరాజు, ఏఎస్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో వైద్య పరీక్షలు

రాజంపేట: ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మందులు అందజేశారు. పిల్లలు పౌష్టికాహారం తీసుకునేలా చూడాలని సంబంధిత టీచర్లకు సూచించారు. డాక్టర్ పల్ల హరీష్ గౌడ్, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పాలాభిషేకం



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి రూ.10 కోట్ల నిధులు కేటాయించిన నేపథ్యంలో ఎల్లారెడ్డి పట్టణంలో గురువారం కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ నాయకులు అజర్, గయాజుద్దీన్, చెన్న లక్ష్మణ్, సాయిబాబా పాల్గొన్నారు.

డాక్టర్ రిషితకు సన్మానం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): తాండూర్ గ్రామానికి చెందిన అవుసుల రిషితను గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రాజ్‌దాస్, డీఎల్‌పీవో సురేందర్ సమక్షంలో సన్మానించారు. రిషిత ఇటీవల హైద్రాబాద్‌లోని దేవ్స హోమియోపతిక్ మెడికల్ కాలేజీలో బీహెచ్ఎంఎస్ పూర్తిచేసి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. హోమియోపతిలో డాక్టరేట్ పట్టా పొంది తాండూర్ గ్రామంతోపాటు నాగిరెడ్డిపేట మండలానికి ఆమె గుర్తింపు తీసుకువచ్చిందని ఎంపీపీ రాజ్‌దాస్ పేర్కొన్నారు. అనంతరం రిషితకు శాలువాను కప్పి ఘనంగా సత్కరించారు. నాగిరెడ్డిపేట ఎంపీడీవో రఘు, ఎంపీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్‌పై కళాజాత

లింగంపేట(ఎల్లారెడ్డి): ముస్తాపూర్‌లో గురువారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్వచ్ఛ భారత్‌పై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మరుగుదొడ్లను వాడాలని, ఆరుబయట మలవిసర్జన చేయడం వల్ల ఎదురయ్యే సమస్యల గురించి వివరించారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలన్నారు. వీధుల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్తాచెదారం వేయకూడదన్నారు.

మట్టి రోడ్లకు మోక్షమెప్పుడో?

- పలుచోట్ల అర్ధాంతరంగా నిలిచిన బీటీ రోడ్డు పనులు
- పత్తాలేని కాంట్రాక్టర్లు
- త్వరగా పనులు పూర్తి చేయాలని స్థానికుల విజ్ఞప్తి



కంకర వేసి అర్ధాంతరంగా వదిలేసిన గుడితండా రోడ్డు

రాజంపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పల్లె, తండా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2018 ఆగస్టు 2న తండాలను నూతన గ్రామ పంచాయతీలుగా చేయడానికి శ్రీకారం చుట్టింది. తండాలు నూతన గ్రామ పంచాయతీలుగా ఏర్పడటం వల్ల గ్రామాలతో పాటు తండాలు సైతం అభివృద్ధి బాటలో పయనిస్తాయని ఆశించింది. ప్రభుత్వ ఆలోచన బాగానే ఉన్నా వాటిని అమలు పరిచే విధానంలో విఫలమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా చాలా తండాలు అటవీ శాఖ అధీనంలో ఉన్నాయి. దీంతో తండాలలో ప్రభుత్వం అందించే పథకాలు అమలు చేయాలంటే అడ్డంకులు వస్తున్నాయి. రాజంపేట మండలం గుడితండాకు వెళ్లే మార్గంలో మూడేళ్ల క్రితం బీటీ రోడ్డు పనులు ప్రారంభించినా అర్ధాంతరంగా నిలిచిపోయాయి. సంబంధిత కాంట్రాక్టర్ అసలు ఉన్నాడా లేడా అనే అనుమానం వ్యక్తం అవుతున్నాయి.

ఎల్లారెడ్డిపల్లి నుంచి శేర్‌శంకర్ తండా వరకు గతంలో బీటీ రోడ్డు పనులను ప్రారంభించారు. కానీ ఈ పనులు ఎల్లారెడ్డిపల్లి నుంచి ఎల్లారెడ్డిపల్లితండా వరకు మాత్రమే పనులు జరిగాయి. ఫారెస్టు అధికారులు అటవి పరిధిలోని తండాలకు బీటీ రోడ్లకు అనుమతులు లేవని తెలపడంతో కాంట్రాక్టర్ బీటీ రోడ్డు పనులను నిలిపేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా తండాలకు బీటీ రోడ్ల సమస్య తీరుతుందని తండావాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి



తండాలకు బీటీ రోడ్డు పనులు ప్రారంభించి 3 సంవత్సరాలు అవుతోంది. సంబంధిత కాంట్రాక్టర్ కంకర వేసి వెళ్లిపోయాడు. ఇప్పటికీ అలాగే ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బీటీ రోడ్డు పనులు పూర్తయ్యేలా చూడాలి.

– గుగ్లోత్ బాల్యా నాయక్, గుడితండా

ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలి



మద్నూర్‌లో మాట్లాడుతున్న అధికారులు

మద్నూర్(జుక్కల్): పద్దెనిమిదేళ్లు నిండిన యువత ఓటరు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ భరత్ సూచించారు. స్థానిక తహసీల్ కార్యాలయంలో గురువారం మండల పరిధిలోని బూత్‌లెవల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా ఓటు నమోదు స్పెషల్ క్యాంపెయిన్‌కు సంబంధించి బీఎల్‌వోలు వారి పోలింగ్ స్టేషన్‌లో అందుబాటులో ఉండాలని సూచించారు. 20, 21 తేదీలలో పోలింగ్ స్టేషన్‌లలో బీఎల్‌వోలు కొత్తగా ఓటరు నమోదు దరఖాస్తులను స్వీకరిస్తారన్నారు.

బాన్సువాడ రూరల్: యువతీ, యువకులు ఓటర్‌గా నమోదు చేసుకోవానికి ఎన్నికల కమిషన్ మరోసారి అవకాశం కల్పించిందని బాన్సువాడ తహసీల్దార్ వరప్రసాద్ తెలిపారు. ఈనెల 22 వరకు దరఖాస్తుకు అవకాశం ఉందన్నారు.

మైనార్టీ గురుకులాల్లో విద్యార్థులను చేర్పించాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఉపాధ్యాయులు

బాన్సువాడ రూరల్: తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని ఉపాధ్యాయులు కోరారు. గురువారం ఎల్లారెడ్డిలోని మైనార్టీ గురుకుల బాలుర పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు సోమేశ్వర్ గ్రామంలో పర్యటించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. 2024–25 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో ప్రవేశం కోసం ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఫిబ్రవరి 6లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంగ్లీష్ మీడియంలో విద్యాబోధన, ఉచిత పాఠ్య, రాత పుస్తకాలతో పాటు యునిఫాం, స్పోర్ట్స్ డ్రెస్ కిట్, భోజన వసతి ఉంటుందన్నారు. 6,7,8 తరగతుల్లోనూ పరిమిత సంఖ్యలో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 99087 20671కు సంప్రదించాలన్నారు.

ఊరూరా ప్రచారం చేయాలి



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

మాచారెడ్డి: కేంద్ర ప్రభుత్వ పథకాలను కార్యకర్తలు ఊరూరా ప్రచారం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు అరుణ తార అన్నారు. గురువారం లచ్చాపేటలో వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ మేరకు ప్రజలకు అర్థమయ్యే విధంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను ఎల్ఈడీ టీవీ స్క్రీన్‌పై ప్రదర్శించారు. అనంతరం వికసిత్ భారత్ నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పొన్నాల వెంకట్ రెడ్డి, నేతలు తోట బాల్ రాజు నరసింహ స్వామి, బూస సురేష్, సంధ్య, అంకం హారిక గ్రామస్తులు ఉన్నారు.

కేంద్ర పథకాలను వినియోగించుకోవాలి

నస్రుల్లాబాద్(బాన్సువాడ): కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం మైలారం, కామిశెట్టిపల్లిలో వికసిత భారత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పథకాలను ప్రజలకు తెలియ జేయడం కోసమే సంకల్ప యాత్ర ప్రారంభించారన్నారు. మండల అధ్యక్షులు సున్నం సాయిలు, నాయకులు దొరబాబు, హన్మండ్లు యాదవ్, మేకల రాములు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాంత్ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి



సమావేశమైన ముదిరాజ్ మహాసభ నేతలు

దోమకొండ: బీబీపేట తహసీల్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ ఆత్మహత్య చేసుకున్న శ్రీకాంత్ కుటుంబానికి ప్రభుత్వం వెంటనే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి అబ్రబోయిన స్వామి అన్నారు. గురువారం మండల కేంద్రంలో మహాసభ ప్రతినిధులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. జూనియర్ అసిస్టెంట్ ఆత్మహత్యకు కారణమైన ఎమ్మార్వోపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. జీతాలు రాక, కుటుంబం గడవక ఆర్థిక ఇబ్బందులతో శ్రీకాంత్ ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. ప్రతినిధులు సీతారాం మధు, నాగారపు రాములు, తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

■ నేడు పాల్వంచకు ఎమ్మెల్యే రాక

మాచారెడ్డి: పాల్వంచ మండల కేంద్రంలో శుక్రవారం సరళా ఫౌండేషన్, గౌతం న్యూరో కేర్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత మెగా న్యూరో వైద్య శిబిరాన్ని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ప్రారంభిస్తారని బీజేపీ ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు తోట బాల్‌రాజు గురువారం తెలిపారు.

■ ఎస్సీ ఎస్టీ పాడి రైతులకు సబ్సిడీపై యంత్రాలు

రామారెడ్డి: పశువైద్య శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ పాడి రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై గడ్డి కోసే యంత్రాలను అందిస్తుందని రామారెడ్డి పశువైద్యాధికారి రమేష్ గురువారం తెలిపారు. 2 హెచ్‌పీ 3 బ్లేడ్ గడ్డి కోసే యంత్రంపై రూ.8 వేల సబ్సిడీ, 3 హెచ్‌పీ 3 బ్లేడ్ మీద రూ.10 వేల సబ్సిడీ ఇస్తున్నారని, ఆసక్తిగల రైతులు మండలంలో పశువైద్య కేంద్రానికి వచ్చి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

■ దరఖాస్తుల ఆహ్వానం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశానికి 20 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మీబాయి తెలిపారు. ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

సంక్షిప్తం

ఓంశాంతి కేంద్రంలో విశ్వశాంతి దినోత్సవం

కామారెడ్డి అర్బన్: ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం వ్యవస్థాపకులు బ్రహ్మబాబా వర్ధంతి సందర్భంగా గురువారం కామారెడ్డి ఓంశాంతి కేంద్రంలో విశ్వశాంతి దినోత్సవం నిర్వహించారు. బ్రహ్మబాబాకు నివాళి, భజనలు, ధ్యానం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ఇంచార్జి రాజయోగిని జయదిదీ, బీజేపీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గడ్డం రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ వినియోగంపై రైతులకు అవగాహన

భిక్కనూరు: రామేశ్వర్‌పల్లిలో డ్రోన్ వినియోగంపై గురువారం రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు అవగాహన కల్పించారు. ఒక ఎకరం పంటకు ఎనిమిది నిమిషాల్లో పురుగుల మందును డ్రోన్ సహాయంలో పిచికారీ చేయవచ్చని రైతులకు వివరించారు. సర్పంచ్ పోతిరెడ్డి, వీడీసీ అధ్యక్షుడు తక్కళ్ల నర్సారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాండం తొలుచు పురుగు నివారణకు చర్యలు

భిక్కనూరు: వరిపైరుకు కాండం తొలుచు పురుగు ఆశించిందని, నివారణకు చర్యలు తీసుకోవాలని భిక్కనూరు మండల వ్యవసాయాధికారి రాధ సూచించారు. గురువారం ఆమె రామేశ్వర్‌పల్లి గ్రామంలోని పంటపొలాలను పరిశీలించారు. కాండం తొలుచు పురుగు నివారణకు కర్టప్ హైడ్రోక్లోరైడ్ 8కేజీని ఎకరాకు చల్లుకోవాలని సూచించారు. ఏఈవో వినోద్‌గౌడ్, రైతులు తక్కళ్ల నర్సరెడ్డి, తక్కళ్ల బాపురెడ్డి ఉన్నారు.

శ్రీరామ మందిరంలో పూజలు



బాన్సువాడ రూరల్: దేశాయిపేట్ రామాలయంలో గురువారం గ్రామానికి చెందిన రామభక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 22న అయోధ్యలో బాల రాముని ప్రతిష్ఠాపన విజయవంతంగా జరగాలని ఆకాంక్షించారు. రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో 500 సంవత్సరాల రామభక్తుల పోరాట చరిత్రగల జాగృతి పుస్తకాన్ని ఆవిష్కరించారు. గ్రామస్తులకు పుస్తకాలతో పాటు కాషాయ జెండాలను పంపిణీ చేశారు.

ఇంటింటికి శ్రీరామ పూజిత అక్షింతలు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంలో అయోధ్య శ్రీరామ జన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీరామ పూజిత అంక్షింతలను శ్రీ రామ భక్తులు ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల శ్రీ రామ భక్తులు పాల్గొన్నారు.

యాసంగి పంటల పరిశీలన



గాంధారి(ఎల్లారెడ్డి): గండివేట్, సీతాయిపల్లి, వెంకటాపూర్ గ్రామాల్లో గురువారం పర్యటించి యాసంగి పంటలను పరిశీలించినట్లు ఏవో నరేష్ తెలిపారు. జొన్న, మొక్కజొన్న పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేసినట్లు చెప్పారు. ఏఈవో దీక్షిత్ రెడ్డి పాల్గొన్నారు.

బీసీ సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాలకృష్ణ



బాన్సువాడ : బీసీ సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జిగా గంట్యాల బాలకృష్ణను నియమించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. బీసీల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు. అనంతరం బీసీ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్లను మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ ఆవిష్కరించారు.

సమస్యలు పరిష్కారం అయ్యేనా ?

- రికార్డులకే పరిమితమవుతున్న తీర్మానాలు, నివేదికలు
- నేడు మండల సర్వసభ్య సమావేశం
- ఈ నెల 31తో ముగియనున్న సర్పంచుల పదవీ కాలం
- ఐదేళ్లు దిష్టిబొమ్మల్లా ఉన్నామని ఎంపీటీసీల ఆవేదన



కాలువ లేక రోడ్డుపైకి వస్తున్న మురికి

బిచ్కుంద(జుక్కల్): అధికారులు ప్రజాప్రతినిధుల సమన్వయ లోపంతో గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. సమస్యలు గుర్తించి ఎప్పటికప్పుడు పరిష్కరించాల్సిన వారు అటువైపు దృష్టి సారించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలు తీర్చండి మహాప్రభు అంటూ మొరపెట్టుకున్నా చలనం లేదు. శుక్రవారం జరిగే మండల సర్వసభ్య సమావేశంలోనైనా సమస్యలపై చర్చించి పరిష్కారం వైపు అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టాలని ప్రజలు ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్నారు. మండల కేంద్రంలో 4 నెలల క్రితం సెంట్రల్ లైటింగ్, రోడ్డు వెడల్పు కోసం రోడ్డును తవ్వి పనులు వదిలేశారు. గుంతలు ప్రమాదకరంగా మారాయి. వైకుంఠ ధామాల వద్ద కరెంటు, నీటి వసతి లేదు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించినా నేటి వరకు నిరుపయోగంగా ఉన్నాయి. తాగునీరు నెలలో ఇరవై రోజులు మాత్రమే వస్తుంది. ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సర్వసభ్య సమావేశంలో సభ దృష్టికి వచ్చిన సమస్యలు పరిష్కరిస్తామని పనుల కోసం ప్రతిపాదనలు, తీర్మానాలు చేసినా అవి రికార్డులకే పరిమితం అవుతున్నాయి. అభివృద్ధి మచ్చుకైనా కానరావడం లేదు. ఏ గ్రామానికి వెళ్లినా సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. పుల్కల్, బిచ్కుంద ప్రభుత్వ ఆస్పత్రిలో సిబ్బంది, మందుల కొరత, వైద్య పరికరాలు లేక వైద్యం అందని ద్రాక్షలా మారింది. పాఠశాలలో కనీస మౌలికసదుపాయాలు లేక ఎన్నో అవస్థలు పడుతున్నారు. మండలంలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా కొనసాగుతుంది.

సర్పంచులు, ఎంపీటీసీల ఆవేదన..

ఐదేళ్ల పదవీ కాలంలో మండల పరిషత్, గ్రామ పంచాయతీలకు తగిన నిధులు ప్రభుత్వం కేటాయించకపోవడంతో చాలా ఇబ్బందులు పడాల్సి వచ్చిందని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంపీటీసీలకు ప్రభుత్వం అరకొర నిధులు కేటాయించడంతో పూర్తి స్థాయిలో సమస్యలు పరిష్కరించలేకపోయామని, దిష్టిబొమ్మల్లా మిగిలిపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జూన్‌తో ఎంపీటీసీల పదవీ కాలం ముగియనుంది. సర్పంచుల పదవీకాలం ఈ నెల 31తో ముగియనుంది. ప్రభుత్వం నిధులు కేటాయించి సర్పంచుల పదవీ కాలం పొడిగించి ఇన్‌చార్జి సర్పంచులుగా కొనసాగించాలని సర్పంచులు కోరుతున్నారు.

అయోధ్య శ్రీరాముడి లడ్డూకి ఘన స్వాగతం



పూజ చేస్తున్న ఎమ్మెల్యే కేవీఆర్ సతీమణి

కామారెడ్డి టౌన్: తెలంగాణ రాష్ట్రం నుంచి అయోధ్య రాముడికి సమర్పించే 1,265 కిలోల భారీ లడ్డూ గురువారం జిల్లా కేంద్రానికి చేరుకుంది. కామారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే రమణారెడ్డి సతీమణి విజయతో పాటు నేతలు భారీ లడ్డూకు పూజలు నిర్వహించారు. సికింద్రాబాద్‌లోని శ్రీరామా క్యాటరింగ్ సర్వీస్ యజమాని నాగభూషణం ఆధ్వర్యంలో లడ్డూను తయారు చేశారు. ఈనెల 22న అయోధ్యలో జరిగే బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠాపనకు ఈ భారీ లడ్డూను సమర్పించనున్నారు.

గ్రామసభలతో జీపీడీపీ రూపొందించాలి



మాట్లాడుతున్న డీఎల్‌పీవో సురేందర్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామసభలు నిర్వహించి 2024–25కు సంబంధించిన గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు(జీపీడీపీ) రూపొందించాలని ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్ సూచించారు. నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. సమావేశంలో నాగిరెడ్డిపేట ఎంపీపీ రాజ్‌దాస్, ఎంపీడీవో రఘు, ఎంపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న తాడ్వాయి ఎంపీడీవో రాజ్‌వీర్

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఉపాధి హామీ పనులలో కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. తాడ్వాయి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గ్రామ కార్యదర్శులు, ఫీల్డు అసిస్టెంటులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీవో హెక్సీఫా రాణి, గ్రామ కార్యదర్శులు, ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.


రాజంపేటలో..



మాట్లాడుతున్న ఎంపీడీవో బాలకిషన్

రాజంపేట: మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఎస్ఆర్ఈజీయస్ సిబ్బందితో గురువారం ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బాలకిషన్ మాట్లాడుతూ..నర్సరీలలో మొక్కల పెంపకం, వాటి వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయాలని సంబంధిత అధికారులను, ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. సెంట్రల్ టీం పర్యవేక్షణకు వచ్చే అవకాశం ఉన్నందున ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఎంపీవో రఘురాం, టీఏ భాస్కర్ పాల్గొన్నారు.

విభజన హామీలు నెరవేర్చాలి



కామారెడ్డి టౌన్: రాష్ట్ర విభజన హామీలను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చాలని తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు కుంబాల లక్ష్మణ్ యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం టీజేఎస్ రాష్ట్ర సదస్సు వాల్ పోస్టర్లను జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఈనెల 21న కేంద్ర ప్రభుత్వ వివక్షపై హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఆయన కోరారు. బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, టీజేఎస్ నాయకులు వివేక్, రాజు, దినేష్, విజయ్ ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



తనిఖీ చేస్తున్న పోలీసులు

బాన్సువాడ రూరల్: వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోవడంతో పాటు వాటిని కచ్చితంగా పాటించాలని బాన్సువాడ సీఐ మహేందర్ రెడ్డి కోరారు. గురువారం బాన్సువాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొయ్యగుట్ట, బీర్కూర్, బుడ్మి చౌరస్తాల్లో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఇప్పటికే పెండింగ్ చలానాలు ఉన్నవారు వెంటనే చెల్లించాలని కోరారు. పలువురికి జరిమానాలు విధించారు.

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని కామారెడ్డి –ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో గురువారం పోలీసుల ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. ఏఎస్సై సంజీవులు, సిబ్బంది పాల్గొన్నారు.

పట్ట పగలే వెలుగుతున్న హైమాస్ట్ లైట్లు



పిట్లంలో వెలుగుతున్న లైట్లు

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలో జామ మసీద్, ఆర్యసమాజ్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన హైమాస్ట్, సాధారణ విద్యుత్ స్థంబాల లైట్లు గురువారం పట్టపగలే వెలుగుతున్నాయి. విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని అనేక సార్లు ప్రభుత్వాలు అధికారులు సూచిస్తున్నా కింది స్థాయి అధికారులు మాత్రం ఎలాంటి చలనం లేకుండా వ్యవహరిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు.

ఆలయ ప్రాంగణాల్లో శ్రమదానం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో గల ఆలయాల్లో గురువారం స్వచ్ఛందంగా యువకులు శ్రమదానం చేశారు. ఈ నెల 22న అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని దృష్టిలో పెట్టుకుని ఆలయాల ప్రాంగణాలను, గర్భ గుళ్లను నీటితో కడిగి శుభ్రం చేశారు. చెత్తను తొలగించారు.